# యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు



లక్ష్మీనారసింహుల నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరు కల్యాణోత్సవం శనివారం శాస్త్రోక్తంగా జరిపించారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయం స్వామి వారికి సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణోత్సవం జరిపించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పిన అర్చకులు తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. కార్తీకమాసం సందర్భంగా కొండకింద వ్రత మండపంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో దీపారాధనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.42,19,215 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

# నేర ప్రవృత్తిని మార్చుకోవాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు**



న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 2 : చట్టపరమైన హక్కులు, న్యాయ సహాయం అంశాలపై అవగాహన పెంచుకుని నేర ప్రవృత్తిని మార్చుకొని కుటుంబంతో సంతోషంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి సబ్ జైలులోని ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సరిచేసుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా మారాలన్నారు. అనంతరం డాక్టర్ నిరోష ఖైదీలకు జనరల్ వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతి దేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌చార్జి కార్యదర్శి కె.దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, న్యాయవాదులు ఎస్.జైపాల్‌రెడ్డి, జి.శంకర్, జైలు పర్యవేక్షణాధికారి పూర్ణచందర్, డీఎంహెచ్ఓ పరిపూర్ణాచారి పాల్గొన్నారు.

## నేడు పొడిచేడులో శ్రీకాంతాచారి వర్ధంతి సభ

మోత్కూరు, డిసెంబర్ 2 : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి14వ వర్ధంతి ఆదివారం మండలంలోని పొడిచేడులో జరుగనున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన మహోద్యమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష శ్రీకాంతాచారిలో ఉద్యమావేశాన్ని నింపింది. ఈ క్రమంలో అప్పటి సమైక్య పాలకులు ఉద్యమకారులపై విధించిన దమనకాండ, అరెస్టులను తట్టుకోలేని శ్రీకాంతాచారి తన చావుతోనైనా సీమాంధ్ర పాలకులకు కనువిప్పు కలగాలన్న ఉద్దేశ్యంతో 2009, నవంబర్ 29న తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చికిత్స పొందుతూ డిసెంబర్ 3న మృతి చెందిన విషయం తెలిసిందే. మండలంలోని పొడిచేడుకు చెందిన కాసోజు వెంకటాచారి-శంకరమ్మ పెద్ద కుమారుడు శ్రీకాంతాచారి. గ్రామంలోని శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం ఇంటి వద్ద సంతాప సభ నిర్వహించనున్నట్లు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ తెలిపారు.

# 12 నుంచి తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె




సమ్మె సన్నాహక కార్యక్రమంలో మాట్లాడుతున్న జీడీఎస్ ఉద్యోగులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 2 : ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి పెన్షన్‌తో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు ఈ నెల 12 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు జీడీఎస్‌పీజేసీఏ సూర్యాపేట డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు, చైర్మన్ రవి తెలిపారు. శనివారం స్థానిక ఐఈ సబ్ పోస్టాఫీస్ వద్ద సమ్మెకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. పెయిడ్ లీవ్‌లను 180 రోజుల వరకు నగదుగా మార్చుకునే అవకాశం ఇవ్వాలన్నారు. సమ్మెలో గ్రామీణ తపాలా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఓ.లింగయ్య, పుల్లయ్య, సత్యం, కరుణాకర్, శుక్ర, దివ్య, అఖిల, మేరీ, నౌసిన్, చికిత, గోపి, మల్లయ్య, ఆంజనేయులు, ప్రేమ్, లావణ్య, వెంకటరమణారెడ్డి, శ్రవణ్, వెంకటాచారి పాల్గొన్నారు.



నల్లగొండ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రజలు

# 3రోజుల్లో రూ.4.37కోట్లు


- ఆర్టీసీకి కలిసివచ్చిన ఎలక్షన్
- నల్లగొండ జిల్లా రీజియన్‌కు భారీ ఆదాయం

నల్లగొండ సిటీ, డిసెంబరు 2 : శాసనసభ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ నల్లగొండ రీజియన్‌కు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరింది. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు రూ.4,37,22,000 ఆదాయం వచ్చింది. ఉద్యోగ, వ్యాపార, బతుకుదెరువు రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు కుటుంబాలతో సహ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామాలకు తరలివచ్చారు. వీరిలో సొంత వాహనాలు మినహాయిస్తే ఎక్కువ మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించారు. దీంతో నవంబర్ 29నుంచి డిసెంబర్1వ తేదీ వరకు బస్సులు కిటకిటలాడాయి. ఎక్కువ మంది ముందుగానే టికెట్లు రిజర్వేషన్ చేసుకున్నారు. ఎన్నికల సిబ్బంది తరలింపు, ఈవీఎం బాక్సుల తరలింపునకు ఆర్టీసీ బస్సులనే వినియోగించడంతో ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది.

**రూ.97.74లక్షలతో నల్లగొండ అగ్రస్థానం**

రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో నల్లగొండ డిపో రూ.97.74లక్షల ఆదాయంతో అగ్రస్థానంలో నిలవగా, మిర్యాలగూడ డిపో రూ.76.77లక్షలతో ద్వితీయ, సూర్యాపేట డిపో రూ.72.20లక్షలతో తృతీయ, రూ.67.06లక్షలతో దేవరకొండ నాలుగు, రూ.60లక్షలతో యాదగిరిగుట్ట ఐదో స్థానంలో ఉండగా, రూ.54.11లక్షలతో కోదాడ ఆరో స్థానంలో, 9.33లక్షలతో నార్కట్‌పల్లి డిపో ఆఖరి స్థానంలో నిలిచింది.

**ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు**



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేశాం. ఓటు వేసేందుకు వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రద్దీని దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటున్నాం ఆదివారం ఎక్కువ రద్దీ ఉండే పరిస్థితి ఉండడంతో అదనపు బస్సులను నడిపేందుకు ప్రణాళిక చేస్తున్నాం.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం

# నేడు ర్యాలీలకు అనుమతి లేదు

- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- రాజకీయ నాయకులు కిలో మీటర్ దూరం పాటించాలి
- ఎస్పీ అపూర్వారావు



ఎస్పీ అపూర్వారావు

నీలగిరి, డిసెంబర్ 2 : ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన క్రమంలో నేడు కౌంటింగ్ నిర్వహించనున్నందున ర్యాలీలు, బాణసంచ కాల్చడం నిషేధమని జిల్లా ఎస్పీ కె.అపూర్వారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని, విజయం సాధించిన అభ్యర్థులు, వారి రాజకీయ పార్టీ నాయకులు, అనుచరులు 4న ర్యాలీకి సంబంధించి పోలీస్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి ద్వారా జారీ చేసిన పాస్‌లు కలిగిన వారిని అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు తమ పాస్‌లతో హాజరుకావాలన్నారు. కౌంటింగ్‌కు వచ్చే ఏజెంట్లు అగ్గిపెట్టెలు, లైటర్లు, కెమెరాలు, ఫోన్లు, వాటర్‌బాటిల్స్ తీసుక రావద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాలకు కిలో మీటర్ దూరంలో రాజకీయ నాయకులు, అభ్యర్థులు, అనుచరులు ఉండాలని సూచించారు.

**పాటించాల్సిన సూచనలు...**

- కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అములో ఉంటుంది.
- కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో కిలో మీటర్ రేడియస్ వరకు ప్రజలు గుమ్మి గూడవద్దు.
- మద్యం అమ్మకాలు ఆదివాకం ఉదయం 6 గంటల నుంచి డిసెంబర్ 4 ఉదయం 6గంటల వరకు నిషేధం.
- ఎవ్వరూ పటాకులు కాల్చరాదు.
- రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు భద్రతా సిబ్బందికి (సెక్యూరిటీ వారికి) చూపిస్తేనే కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశం ఉంటుంది.
- మొబైల్ ఫోన్లు, అగ్గిపెట్టెలు, లైటర్ల వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాల్లోకి తీసుకెళ్లడానికి అవకాశం లేదు.
- గెలుపొందిన అభ్యర్థులు /కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు చేయకూడదు.
- ప్రతీ ఒక్కరు పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి సహకరించగలరు.
- నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు.